
కాకర్ల హనుమంతరావు

# కథకాని కథ



"పోస్ట్..."
అన్న కేక హంస రుతించినట్లు, పికావళి పంచమమూదినట్లు, వీణ పలికించినట్లు, మల్లెల వానలో పరవశాన స్నానమాడినట్లు భావాతీత పరిమళాన్ని మోసుకొచ్చింది ఆర్యన్‌కి.
ఆ వారం 'ధరిత్రి వీక్లీలో' వచ్చిన తన కథని చదువుతున్నాడతను. కథ తన గుండెల మీద కూర్చున్న పాపాయిలా వుంది.
ఇంతలోనే పోస్ట్‌మెన్ కేక... ...
వీక్లీనలాగే పొదివి పట్టుకుని గేటు కేసి నడిచాడు.

''నమస్తే సర్. కొత్త సీరియల్ రాస్తున్నారా సార్? మా ఆవిడ అడగమంది. దానికి కథల పిచ్చి సార్...'' అన్నాడు వినయంగా ఉత్తరాల కట్టతీస్తూ గురుమూర్తి.

ఆలోచించకుండా అప్పటికప్పుడు ఏదో సమాధానం చెప్పేసాడు ఆర్యన్. రెండు కవర్లిచ్చి 'స్పీడ్ పోస్ట్‌లా' క్షణంలో సాగిపోయాడు పోస్ట్‌మెన్.

సీరియల్ గురించి అడిగినందుకు సంతోషం.

'కథల పిచ్చి'- అన్నందుకు కోపం.

రెండు విభిన్నమైన గీతలు ఆర్యన్ ముఖంలోకి తొంగి చూసి మాయమయ్యాయి.

'సినిమాలా, క్రికెట్‌లా ఇది పిచ్చికాదు. కథల్ని ప్రేమించే టేస్ట్, రచయితల్ని అభిమానించే మహోన్నత వ్యక్తిత్వం...

కథంటే ఉత్తరాల్ని విసిరేసి పోవటం కాదు...

అసలు కథంటే... అరిచాననుకున్నాడు. అరవలేదు. పోనీ అరుద్దామనుకున్నాడు. కానీ 'వచ్చినవాడు ఫల్గుణుడు' అని ఏదో పద్య నాటకంలో అన్నట్లు, ఆ వచ్చిన వాడు వచ్చినట్లే- మాయమయ్యాడు మరి!

మొదటి కవరు ఓ అభిమాని రాసాడు.

రెండోది 'ధరిత్రి' నుంచి. ఎడిటర్ రామం రాసాడు.

''మీకథ చూసాను. అలాంటిదెక్కడో చదివినట్లు అన్పిస్తోంది. ఓసారి పరిశీలించండి'' - అంటూ రామం సంతకం 'ఫకాలుమని' నవ్వుతోంది. ఆ ఉత్తరాన్ని నలిపి పారేశాడు.

పత్రిక ఆఫీసుకి ఫోన్ చేసాడు.

''కథని తిరిగి పంపుతావా? అసలు నీ ఉద్దేశమేమిటి? అంటూ హుంకరించాడు.

రామం నెమ్మదిగానే బదులిచ్చాడు.

''మీకథతోబాటు మరో జెరాక్స్ కూడా పంపేశాను. అది చూసేక మీ ఉద్దేశమేమిటో మీరే చెప్పండి'' అంటూ ముగించాడు.

ఆతృతగా 'జెరాక్స్ కథ'ని చదివాడు ఆర్యన్.

అది 'భరద్వాజ్'ది.

రామం అన్నట్లు 'రేఖా మాత్రంగా' కథాంశం కలుస్తోంది. గిల్టీగా ఫీలవుతూ పూర్తిగా చదివాడు.

మేడ మీదికెళ్ళి, కాసేపు చల్లగాలిలో తిరిగేడు. ఆలోచనల సెగలు మాత్రం చల్లబడలేదు.

అచ్చులో పేరు చూసుకోవాలన్న కోరిక తలెత్తి, లతలా పాకి, చెట్టయి నిలిచి, శాఖోపశాఖలైన మహావృక్షమై, కీర్తి శిఖరమై విరిగి తనమీదే పడినట్లయ్యింది.

ఎవడు రాయమన్నాడు? ఎందుకు రాయాలి?

అంతా హాయిగా ఆలోచించకుండా బతికేస్తుంటే, అర్ధరాత్రి వరకు నిద్రమానుకుని, తెలుగు అక్షరాల్ని మాటల మూటల్ని చేసి, భావాల పదునుపెట్టి, కథాప్రపంచంలోకి జారిపోయి, ప్రింటయిన కథను చూసి మురిసిపోయి బాగుందంటూ వచ్చి 'లేఖావళి' ఉత్తరాలకి పొంగిపోయిన బలహీనతకి తగిన ప్రతిఫలమే దక్కింది.

'మీ కథ ఫలానా కథలా వుంది'- అనటంకన్నా తిట్టు మరేదీ లేదు రచయితలకి-

అభిమానుల నుంచి రోజూ ఉత్తరాలు వచ్చే స్థితిలో 'నేను రాయగలను' అనే స్థాయినుంచి 'నేనే రాయగలను'అన్న స్థాయికి ఎదిగిన సమయంలో-

నిచ్చెన చివరివరకు ఎక్కాక, కిందికి దిగి రావాల్సిన పరిస్థితి ఎదురైతే...

దురదృష్టానికి ఇంతకుమించిన చిరునామా ఏముంది?

ఇప్పుడేం చేయాలి

నదిలో నిరాశతో కొట్టుకుపోవడమో,

పరిస్థితిని ఎదిరించి నిలబడటమో రెండే ఛాయిస్‌లు.

ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

మేడ దిగి వచ్చాడు ఆర్యన్.

తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' తీసాడు.

'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లలు' అనడానికి ఎంత నమ్మకం కావాలి.

ఏదో ఆలోచన వచ్చింది.

శత్రువు ఎవరోకాదు- 'సమస్యే'

మన యుద్ధం దానితోనే! అవును.

'సీరియల్స్ రాయగలిగే తనకి ఓ చిన్న కథ విషయంలో, ఇంత పట్టుదల నిరుత్సాహం అనవసరం'- అనుకున్నాడు. రామం ఇచ్చిన ఫోన్ నంబర్‌కి డయల్ చేసాడు.

''... క్రిందటి దీపావళి సంచికలో మీ కథ చదివాను.

అలాంటిదే ఇంకెక్కడో చదివినట్లనిపిస్తోంది...'' అంటూ చీకట్లోకి బాణం వదిలాడు.

''అలాగా! మీ ఫోన్నెంబరివ్వండి. రాత్రి నేనే రింగ్ చేస్తాను'' అన్నాడు ప్రముఖ రచయిత భరద్వాజ్. నెంబర్ చెప్పి రిసీవర్ పెట్టేశాడు ఆర్యన్.

తప్పు చేసేనేమో అన్పించింది అతనికి...

తనకి అలాంటి ఊహ రావడమే ఆశ్చర్యం!

డిఫెన్స్‌లో పడి వంకరగా కూడా ఆలోచిస్తున్నందుకు తనమీద తనకే కోపం వచ్చింది. కానీ తప్పదు. అది ఎదగడమో, దిగజారడమో తెలియటంలేదు. ఇంతకన్నా ఏంచేయాలో తెలియలేదు అతనికి...

మెదడు మొద్దుబారినప్పుడు

కాళ్ళు చాపుకుని కూర్చోడంకన్నా, చేయాలనిపించింది. చేసేయడమే కాని, వెనక్కి తిరిగి చూడకూడదనుకున్నాడు! అంతే! 'చేతకానితనం కన్నా, చేసేయడమే ముఖ్యం' అన్పించింది.

భరద్వాజనీ కాస్త టెన్షన్‌లో పెట్టాలనే ఆలోచన వచ్చింది.

భార్యాపిల్లల్తో 'టీక్'కి వెళ్ళిపోయాడు. అలాంటి ఐడియాలు ఎందుకొస్తున్నాయో తెలియటంలేదసలు.

★ ★ ★

గేటు తీసి యింట్లోకి వస్తున్నప్పుడు ఫోన్ రింగ్ అవుతోంది కావల్సినంత నెమ్మదిగా వెళ్ళి రిసీవర్ ఎత్తాడు.

''హలో నేనే... భరద్వాజ్‌ని... నాలుగుసార్లు రింగ్ చేసాను''

''చెప్పండి'' అన్నాడు క్యాజువల్‌గా, ఆర్యన్

తనకన్నా సీనియర్ రైటర్‌తో జంకుగొంకు లేకుండా మాట్లాడటంలో ఉన్న 'థ్రిల్'ని అతను అనుభవిస్తున్నాడు. పెను తుపానుకి కొట్టుకుపోతున్న నవలా లేదు అతని మానసిక స్థితి యిప్పుడు...

''మీరన్నది నిజమే. నా కథకి 'ఇన్స్పిరేషన్' ఏమిటా అని డైరీ తిరగేసాను. రెండేళ్ళక్రితం దసరా స్పెషల్ వీక్లీలో వచ్చిన ప్రసాద్ రచన నన్నాకర్షించింది. విశేషమేమిటంటే- రెండేళ్ళ తర్వాత రాసిన ఆ కథలో ఆ శైలిని గుర్తించినందుకు నిజంగా మీకు హేట్సాఫ్...! ప్రసాద్ కథ 'ఇన్ఫ్లుయన్స్' నాకథ మీద పడింది నిజమే. చూసారామీరు. చెప్పేదాకా నేనది కనుక్కోలేకపోయాను. మీలాంటి 'సద్విమర్శ' చేసే మేధావులు నా అభిమానులయినందుకు ధన్యవాదాలు'' అంటూ పేరైనా అడక్కుండా. హడావుడిగా భరద్వాజ ఫోన్ క్రెడిల్ చేసాడు.

ఆర్యన్ నవ్వుకున్నాడు.

తను పడిన టెన్షన్ పదోవంతయినా పడలేదు భరద్వాజ్ 'తనకెందుకింత టెన్షన్ అనవసరంగా' అనుకున్నాడు.

ఓ కథ మరో కథకి

ఓ పాత్ర మరో పాత్రకి స్ఫూర్తినిస్తాయి.

ఇది అందరికీ తెల్సు ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

ఇది డాక్టరేట్ చేసి చెప్పాల్సినంత గొప్ప విషయమేమీ కాదు...

భరద్వాజ్ 'డిస్క్రిప్షన్' నచ్చింది ఆర్యన్‌కి.

అదే తన ఆయుధమనుకున్నాడు.

★ ★ ★

పడుకునే ముందు మరో ఆలోచన వచ్చింది.

తనకి భరద్వాజ్

భరద్వాజ్‌కి... ప్రసాద్

ప్రసాద్‌కి...?

"...మీలాంటి మహా రచయిత నాకు ఫోన్ చేయడం నా పూర్వ జన్మ సుకృతం సార్...! నేనీమధ్య రాయడం మొదలుపెట్టాను. నాకు ఊహ తెల్సినప్పటినుంచీ మీ కథలు చదువుతున్నాను. మా అమ్మ దాచిన పుస్తకాల్లో మీ కథలున్నాయి. ఆమధ్య 'రైటర్స్ వర్క్‌షాప్'లో మిమ్మల్ని చూసాను. అందర్నీదాటి మీ దగ్గరకి రాలేకపోయాను...!"

''జీవిత కురుక్షేత్రంలో అశాంతి దుర్యోధనుడైతే అనుమానం శకుని లాంటిది. ఇది మన మిత్రుడిలాగే మన వెన్నంటి వుండి. మనం చచ్చిపోయేవరకు శల్యసారథ్యం చేస్తుంది''- అంటారు ఓ రచయిత.

ఆర్యన్- దీనికి అతీతుడేమీకాదు.

★ ★ ★

లక్కీగా ప్రసాద్ కూడా ఫోన్లోనే దొరికాడు.

తనని రైటర్‌గానే పరిచయం చేసుకున్నాడు ఆర్యన్, అవతల మనిషికి తన స్టేటస్ చెప్పక చెబుతూ...

ప్రసాద్ గలగలా మాట్లాడుతున్నాడు.

''... మీలాంటి మహారచయిత నాకు ఫోన్ చేయడం నా పూర్వ జన్మ సుకృతం సార్...! నేనీమధ్య రాయడం మొదలుపెట్టాను. నాకు ఊహ తెల్సినప్పటినుంచీ మీ కథలు చదువుతున్నాను. మా అమ్మ దాచిన పుస్తకాల్లో మీ కథలున్నాయి. ఆమధ్య 'రైటర్స్ వర్క్‌షాప్'లో మిమ్మల్ని చూసాను. అందర్నీదాటి మీ దగ్గరకి రాలేకపోయాను...!'' అంటున్నాడు ప్రసాద్.

''మీ కథ రెండేళ్ళ క్రితం జనవరిలో వచ్చింది... చూశాను చాలా బావుంది'' అన్నాడు ఆర్యన్.

'మీలాంటి చెయ్యి తిరిగి రచయితకి నా కథ నచ్చటం నా అదృష్టం సార్. మీ రచనల ప్రభావం నామీద వుంది. ముఖ్యంగా మీ శైలిని అనుకరించే ప్రయత్నం చేస్తుంటాను'అన్నాడు ప్రసాద్.

ఊపిరి పీల్చుకున్నాడు ఆర్యన్.

కథనుంచి కథ... కథనుంచి కథ... ''నాన్యఃపంథా''

★ ★ ★

రేపు రాయాల్సిన కథ అవుట్‌లైన్స్ ఆలోచిస్తున్నాడు ఆర్యన్.

పత్రికల ఎడిటర్లనీ పబ్లిషర్లనీ నిందించటంకాదు. టేలంట్‌కి స్కిల్‌ని జోడించాలి. ఓ వింత ప్రపంచంలోకి పారిపోయి మనం ఏదనుకుంటే అక్కడది చేయడమే రచనలు చేయడమంటే అనే అంశంమీద స్కెచ్ ఆలోచించాడు.

బేంక్‌కి వెళ్ళేముందు రామానికి ఫోన్ చేసాడు.

మరో అరగంటలో పత్రిక ఆఫీసుకి వస్తున్నానంటూ.

''కథని చెక్ చేసారా'' డైరెక్టుగా అడిగాడు రామం.

''ఓహెన్రీ, మొపాసా, సోమర్‌సెట్‌మామ్, చెకోవ్ కథల్లాగే ఆంధ్ర దేశంలో కథలూ అటూయిటూ తిరుగుతుంటాయ్ ప్రపంచంలో ఉన్న ఆరు కథలే అరవై కోట్ల కథలవుతున్నాయ్''అంటూ భరద్వాజ్ డిస్క్రిప్షన్ ఫాలో అయ్యాడు ఆర్యన్.

''ఓకే, సార్ ఈ వారంలో ఆ కథని పంపేయండి. గోపి చేత మంచి బొమ్మ వేయించి వీక్లీలో వేసేస్తాను-''అన్నాడు రామం.

''థేంక్స్ ఉంటాను...''

''ఒక్క నిముషం సార్! మీతో చెప్పకూడదనుకున్నాను కానీ...

''ఎంత మాట, చెప్పండి'' అన్నాడు ఆర్యన్.

''మా బావమరిది హౌసింగ్‌లోన్‌కి పేపర్స్ సబ్మిట్ చేసాడు. కొద్దిగా చూస్తాను'' అన్నాడు రామం.

'ష్యూర్, లోన్ సంగతే కదా చేయించేస్తాను'

రామం గొంతులో ఈసారి మార్పు వచ్చింది. మృదువుగా చెప్పాడు.

''కాంప్లిమెంటరీ కాపీలు మా వాడిచేత మీ బేంక్‌కి పంపిస్తాను. అనవసరంగా డబ్బుపోసి కొనకండి! అన్నాడు.

కథవెనుక కథ అర్థమై నవ్వుకున్నాడు ఆర్యన్. ★

